క్లుప్తంగా

తిరునక్షత్ర వేడుకలు



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తిరునక్షత్రం సందర్భంగా ఆలయ ఈఓ లక్ష్మీ ప్రసన్న, చైర్మన్ శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజల అనంతరం శ్రీకృష్ణావతారంలో బుగులు వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చారు. రాత్రి 7 గంటలకు ఊయల సేవ, విష్ణుసహస్రనామ పారాయణం, ద్వాదశారాధన నిర్వహించారు.

విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి పాటుపడాలి



జనగామ రూరల్: విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడాలని ఎంపీడీఓ ఉప్పుగళ్ల సంపత్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం మండల విద్యాశాఖాధికారి గురిజాల శంకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. మండలంలోని 25 మంది ఉపాధ్యాయులను సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు.

కళాశాలల బంద్



జనగామ: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల జాప్యాన్ని నిరసిస్తూ జిల్లాలోని యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలతో పాటు జీప్స్ ఫార్మసీ కళాశాలను సోమవారం బంద్ చేశారు. ఉన్నత విద్యా సంస్థలకు పలు విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు పలికారు.

హిందీ భాషా దినోత్సవం



పాలకుర్తి: హిందీ భాషా దినోత్సవాన్ని సోమవారం పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, సాంస్కృతిక తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ పోతుగంటి నర్సయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు వరప్రసాద్, సాయిని సోమన, బాలాజీ, నూర్జహాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థికి కరాటేలో గోల్డ్ మెడల్



రఘునాథపల్లి: మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ విద్యార్థి సిద్ధార్థ గౌతమ్ బ్రౌన్ బెల్ట్ స్పారింగ్ విభాగంలో ప్రతిభ చాటి గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ సోమవారం తెలిపారు. ఈ నెల 14వ తేదీన హైదరాబాద్‌లో ఐకిడో కరాటే వారు నిర్వహించిన ఛాంపియన్ షిప్‌లో అత్యుత్తమ ప్రతిభ చాటి గోల్డ్ మెడల్ సాధించాడన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ గౌతమ్‌ను సోమవారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌తో టీచర్లు తదితరులు అభినందించారు.

నానో యూరియాతో అధిక దిగుబడి

కొడకండ్ల: నానో యూరియా వాడకం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని రైస్ రిసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్త రాములు అన్నారు. సోమవారం నర్సింగాపురం గ్రామంలో పంటల పరిస్థితిపై సమీక్ష, నానో యూరియాపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మండల వ్యవసాయాధికారి విజయ్‌రెడ్డి, కోరమండల్ కంపెనీ డివిజనల్ అగ్రోనామిస్ట్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, జోనల్ మేనేజర్ సజ్జన్‌కుమార్, ఏఈఓ సరిత ఉన్నారు.

సన్మానం

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి (జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గతంలో పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎం ఒంగోలు శాంతకుమారిని పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అన్నెపు పద్మ ఆశోక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుజ్జరి రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మారపల్లి ప్రభాకర్, గద్ద కొమురయ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు పూర్తి చేయండి

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: పట్టణంలోని 3, 4 వార్డుల పరిధిహైదరాబాద్ రూట్‌లో నూతనంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ఆయా వార్డులను సందర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రెయినేజీ నిర్మాణం జరిగిన ప్రాంతం వరకు పై కప్పు పూర్తి చేసి, రెండు వైపులా దారిని అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్‌ను కోరారు. పురపాలిక అధికార యంత్రాంగం స్వచ్ఛతపై దృష్టి సారించి, ప్రజలకు జవాబుదారీతనంగా నిలవాలన్నారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తాళ్ల సురేష్‌రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున లింగయ్య, నాయకులు జూకంటి శ్రీశైలం, ముస్త్యాల దయాకర్, ఉల్లెంగుల సందీప్, బాల్దె ఆంజనేయులు, మామిడాల రాజు, ఉడుగుల కిష్టయ్య, ఉడుగులు నర్సింహులు, ఉల్లెంగుల నర్సింగ్, కృష్ణ, మంగ రామకృష్ణ ఉన్నారు.

పింఛన్లు పెంచాలి



లింగాలఘణపురం: నాయబ్ తహసీల్దార్ షకీర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం పలు మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాలముట్టడి కార్యక్రమం చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ. 6 వేలకు పెంచాలని అన్నారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్, ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కొంపెల్లి అంబేడ్కర్ మాదిగ, ప్రధాన కార్యదర్శి పాకాల కుమారస్వామి, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నగేశ్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చాల వంశీ, ఈగ చక్రపాణి, ఆయా మండలాల అధ్యక్షులు, మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాడు ఎన్టీఆర్, నేడు కేసీఆర్‌ను మోసం చేసిన కడియం

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



రాజయ్య పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

రఘునాథపల్లి: టీడీపీలో నాడు ఎన్టీఆర్‌ను మోసం చేసిన కడియం శ్రీహరి, ఇప్పుడు కేసీఆర్‌ను మోసం చేశాడని, త్వరలో సీఎం రేవంత్‌రెడ్డికి చేయిచ్చి ఏ పార్టీలోకి వెళ్తాడో అందరికి తెలుసని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కుర్చపల్లిలో సోమవారం చేపట్టిన రైతన్న కోసం పాదయాత్రను ఆయన మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్‌లతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ శ్రీహరికి నిజంగా కమిట్‌మెంట్, నిజాయితీ ఉంటే బీఆర్ఎస్ కార్యకర్తల శ్రమతో గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై పాదయాత్ర చేపడితే గుండాలు, రౌడీలను పంపిస్తావా.. నీకు అరువుకు వచ్చే గుండాలు.. రౌడీలు ఉండొచ్చు.. మాకు ప్రాణమిచ్చే బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి బేషరతుగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. పోలీస్ నిర్బంధం ఛేదించి పాదయాత్రను సక్సెస్ చేసుకోవడం కుర్చపల్లి గ్రామస్తుల విజయమన్నారు. వై.కుమార్‌గౌడ్, సేవెల్లి సంపత్, ముసిపట్ల విజయ్, గవ్వాని నాగేశ్వర్, రాజేందర్‌నాయక్, మడ్లపల్లి సునీత, ప్రభాకర్, జనగాం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

నర్మెట: బాలల చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కేస్ వర్కర్ లింగాల ప్రశాంత్ అన్నారు. మచ్చుపహాడ్‌లో విద్యార్థులు, యువత, ప్రజలతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించిన అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక ప్రకారం జీవించే హక్కు, రక్షణ పొందేహక్కు, పాల్గొనే హక్కు, మనుగడ, అభివృద్ధి చెందే హక్కు, విద్యా హక్కు, గుర్తింపు వ్యక్తీకరణ హక్కులు, బాధ్యతలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దామెర వంశీ, హెచ్‌ఎం గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు గొపగోని విజయ్ కుమార్, సబిత, పర్శ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ప్యాడీ డ్రయర్‌ను రిపేరు చేయించాలి



ఏఎంసీలో మూలన పడ్డ ప్యాడీ డ్రయర్

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌లో అత్యంతం విలువైన ప్యాడీ డ్రయర్‌ను రిపేరు చేయించి, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతూ ది గ్రేన్ మార్కెట్ అడ్తి అసోసియేషన్ జనగామ అధ్యక్షుడు మాశెట్టి వెంకన్న ఆధ్వర్యంలో చైర్మన్ బనుక శివరాజ్‌కు సోమవారం వినతి చేశారు. వానాకాలం సీజన్ కోతలు దగ్గర పడుతున్న సమయంలో మూలన పడ్డ ప్యాడీ డ్రయర్‌ను అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. ప్యాడీ డ్రయర్(తేమ ఆరబెట్టే యంత్రం)ను అందుబాటులోకి తీసుకు వస్తే రైతులకు సమయం ఆదా అవడంతో పాటు మద్దతు ధర వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

‘అబాస్’ రద్దు చేయాలి



జనగామ: వైద్యారోగ్య శాఖ పరిధిలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బందికి అబాస్ హాజరు విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వైద్యారోగ్య శాఖ జాయింట్ యాక్షన్ కమిటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లికార్జున్‌రావుకు సోమవారం వినతి చేశారు. జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 4 నుంచి 10 ఉప కేంద్రాలు ఉండగా, అక్కడకు వెళ్లి అబాస్ హాజరు వేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రాసెస్ పూర్తి చేసుకునే వరకు 10 నుంచి 20 కిలో మీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అబాస్ హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

శాలివాహన కులస్తులను అభివృద్ధి చేయాలి



జనగామ రూరల్: శాలివాహన కులస్తులను ప్రభుత్వం అభివృద్ధి చేయాలని రాష్ట్ర అఖిలభారత కుమ్మర శాలివాహన ఉద్యోగ విభాగం అధ్యక్షుడు కుంభకర్ మహాసంగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కుమ్మర ఉద్యోగుల జిల్లా శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసంగ్ మాట్లాడుతూ కుమ్మర శాలివాహన ఉద్యోగులు ఐకమత్యంతో పేదరికంలో ఉన్న కుమ్మర బంధువుల పిల్లలు విద్యారంగంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా కృషి చేయాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. బాల సిద్ధులు, గుడికందుల పరశురాములు, మడికొండ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ఎజెండా

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కొడకండ్ల: కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల: నిధుల మంజూరు లేకున్నా ప్రజలను మభ్యపెట్టేందుకు, ఓట్ల కోసం డ్రామాలు ఆడటం బీఆర్ఎస్ నాయకులదైతే నియోజకవర్గ అభివృద్ధే తన ఎజెండానని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని రైతువేదికలో 41 మంది కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులతో పాటు 21 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోవు మూడేళ్లలో రిజర్వాయర్‌ల పనులు పూర్తి చేయించి సాగునీటి పరవళ్లు తొక్కిస్తానని అన్నారు. మార్కెట్ వైస్ చైర్మన్ ఈరంటి సాయికృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, మార్కెట్ డైరెక్టర్‌లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కాపాడటం ప్రభుత్వ లక్ష్యం

పాలకుర్తి టౌన్: ప్రజల ఆరోగ్యం కాపాడటం, పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 36 మందికి రూ.11,93,000 విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పథకాలు అమలు

దేవరుప్పుల: రాజకీయాలకతీతంగా ఇంటింటా సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వంకే దక్కుతుందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో ప్రత్యేకాధికారి శ్రీధర్‌రావు అధ్యక్షతన 42 మంది లబ్ధిదారులకు రూ.42,04,872 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. తహసీల్దార్ ఆడెపు అండాలు, ఎంపీడీఓ తాటి సురేష్‌కుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల రాజయ్య ఖబడ్దార్

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు



జఫర్‌గఢ్‌లో రాజయ్య చిత్రపటానికి పిండ ప్రదానం చేస్తున్న కాంగ్రెస్ దళిత నాయకులు

రఘునాథపల్లి: ఎమ్మెల్యేగా అనేక అక్రమాలకు పాల్పడి ప్రతి పనికి కమీషన్లు తీసుకున్న చరిత్ర నీదని, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని విమర్శిస్తావా.. ఖబడ్దార్ తాటికొండ రాజయ్యా.. అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు మండిపడ్డారు. సోమవారం కుర్చపల్లిలో మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేపట్టిన పాదయాత్రను అడ్డుకునేందుకు ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. రాజయ్య గో బ్యాక్ అంటూ వీధుల్లో భారీ ర్యాలీ తీశారు. మాజీ జెడ్పీటీసీలు జగదీష్‌చందర్‌రెడ్డి, బొల్లం అజయ్, మేకల నరేందర్, తోటకూరి రమేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజయ్య చిత్రపటానికి పిండ ప్రదానం

జఫర్‌గఢ్: కడియం శ్రీహరిపై వ్యక్తిగత దూషణలు మానుకోకపోతే రాజయ్యను గ్రామాలకు రాకుండా తరిమికొట్టడం ఖాయమంటూ కాంగ్రెస్ దళిత నాయకులు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. కడియం శ్రీహరిపై రాజయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో దళిత నాయకులు రాజయ్య చిత్రపటానికి పిండ ప్రదానం చేశారు. మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ బేబి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఐలయ్య, డానియల్ పాల్గొన్నారు. కాగా, శ్రీహరి పిండ ప్రదానం చేసేందుకు పిలుపునివ్వడంతో మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

శ్రీపతిపల్లిలో..

చిల్పూరు: స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా శ్రీపతిపల్లి గ్రామంలో రాజయ్య దిష్టిబొమ్మతో కాంగ్రెస్ నాయకులు శవయాత్ర చేపట్టి దహనం చేశారు.

రాజయ్య గోబ్యాక్ అంటూ వెలిసిన కాంగ్రెస్ ఫ్లెక్సీలు

స్టేషన్‌ఘన్‌పూర్: దేవాదుల రిజర్వాయర్ అసంపూర్తి పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సాగునీరు అందించాలనే డిమాండ్‌తో రైతన్న కోసం రాజన్న పాదయాత్ర పేరుతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య నిర్వహిస్తున్న పాదయాత్ర సోమవారం రఘునాథపల్లి మండలంలోని కుర్చపల్లి తదితర గ్రామాల్లో ఉండగా కుర్చపల్లికి వెళ్లే రోడ్డులో ఉండే స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని రాఘవాపూర్‌లో జాతీయ రహదారి పక్కన రఘునాథపల్లి మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రాజయ్య గోబ్యాక్–గోబ్యాక్ అంటూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే చొరవతో చెరువులకు జలాలు



చెరువులో పూజలు చేస్తున్న శివకుమార్, గుడి వంశీధర్‌రెడ్డి తదితరులు

లింగాలఘణపురం: ఎమ్మెల్యే కడియం శ్రీహరి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మండలంలోని చెరువులన్నీ గోదావరి జలాలతో నింపుతున్నారని, అందుకు నిదర్శనం మండల కేంద్రంలోని పాత చెరువు మత్తడి పోయడమేనని మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జనగామ మార్కెట్ వైస్ చైర్మన్ శివకుమార్ ఆధ్వర్యంలో పాత చెరువు మత్తడి వద్ద పసుపు, కుంకుమ, పూలు చల్లి పూజలు చేశారు. అనంతరం చెరువు సమీపంలోని పోషమ్మ గుడి వద్ద విలేకరులతో మాట్లాడారు. చెరువులను నింపడమే కాకుండా ఇటీవలే రూ.2.60 కోట్లతో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేయడం జరిగిందని, మరో రూ.60 లక్షలతో కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరీ చేశారని, ఇదంతా ఎమ్మెల్యే కడియం కృషి ఫలితమేనని అన్నారు. అలాంటి నాయకునిపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దిలీప్‌రెడ్డి , బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, మాజీ ఎంపీటీసీలు భిక్షపతి, మల్లేశం , నర్సయ్య, మార్కెట్ డైరెక్టర్లు శ్రీలతారెడ్డి, మోహన్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఉపేందర్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మహిళా కాంగ్రెస్ దినోత్సవం

జనగామ రూరల్: అఖిలభారత మహిళా కాంగ్రెస్ 41వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం బడికే ఇందిర అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్, కావ్య ,శ్రీరెడ్డి శ్రీలత రెడ్డి, వంగాల కళ్యాణి , మున్ని బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణకు పాటుపడాలి

దేవరుప్పుల: చాలీచాలని వేతనాలతో విస్తృత సేవలందించే కంప్యూటర్ ఆపరేటర్లకు వేతనాలం అందక పాల్పడుతున్న ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం పాటుపడాలని ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం ప్రతినిధి రవి కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సూర్యాపేట జిల్లాలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పిడిన ఆపరేటర్ ఏలేటి సోమిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఫ్యాన్ల అందజేత

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది ఆలేటి సిద్ధిరాములు సోమవారం ఎంఈఓ పోతుగంటి నర్సయ్య చేతుల మీదుగా మూడు ఫ్యాన్లను హెచ్‌ఎం చిదురాల శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తు, విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచిన హెచ్‌ఎంను అభినందించారు.

నాగర్‌కర్నూల్ ఎస్పీని కలిసిన మార్కెట్ డైరెక్టర్



చిల్పూరు: నాగర్‌కర్నూల్ ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెంది స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మాదిరెడ్డి యశ్వంత్‌రెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రంజిత్‌రెడ్డి ఉన్నారు.

ప్రశంసపత్రాల అందజేత

బచ్చన్నపేట: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల ప్రబోధ సేవాసమితి–హిందూ జ్ఞాన వేదిక త్రైత సిద్ధాంతం జనగామ కొన్నె ఉపేందర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఇటీవల పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీరామకృష్ణ స్కూల్, వాణి స్కూల్, తుమ్మబాల, రామచంద్రాపురం స్కూల్ తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చిన్నికృష్ణుడి వేషధారణలో నిర్వహించిన కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కాగా, సోమవారం విద్యార్థులకు ప్రశంసపత్రాలు, ఎగ్జామ్ కిట్స్, షీల్డులు అందజేశారు.

విద్యతోనే విజ్ఞానం

బచ్చన్నపేట: విద్యతోనే విజ్ఞానం, విద్యతోనే విశ్వఖ్యాతి పొందవచ్చని శిరాంశెట్టి ఫౌండేషన్ నిర్వాహకులు యాదగిరి, రాజువర్మ, మేఘమాల, కరుణ అన్నారు. పోచన్నపేట ఉన్నత పాఠశాలలో ఆయా తరగతుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సోమవారం నగదు బహుమతి తోపాటు, స్టడీ మెటీరియల్, బ్యాడ్జిలను అందజేశారు. విద్యార్థులు అన్నిరంగాలలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

రఘునాథపల్లి: హైదరాబాద్‌లో నార్సింగ్‌లో ఈ నెల 19, 20, 21 తేదీల్లో నిర్వహించనున్న ఫొటో ఎక్స్‌పో కార్యక్రమ వాల్ పోస్టర్లను సోమవారం మండల కేంద్రంలో తహసీల్దార్ ఫణికిషోర్ ఆవిష్కరించారు. ఫొటో గ్రాఫర్ల జిల్లా ఉపాధ్యక్షుడు కొన్నె సతీష్, ముప్పిడి సాంబ, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి మహోత్సవం

రఘునాథపల్లి: నిడిగొండ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి జయంతి మహోత్సవం నిర్వహించారు. కెవిటి ఆచార్య స్వామి పర్యవేక్షణలో ఆలయ వేద పండితులు కృష్ణమాచార్యుల మంత్రోచ్ఛారణాలతో స్తోత్ర పారాయణం, దివ్య ప్రబంధ సేవాకాలం, శ్రీరుక్మిణి సత్యబామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు పుష్పార్చన, విషేశ నీరాజనాలు, ఉంజల్ సేవ నిర్వహించారు.

ముందస్తు అరెస్టు

లింగాలఘణపురం: మండలంలోని కుందారంకు చెందిన బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర వీరస్వామిని సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. గ్రూపు–1 విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేస్తూ హైదరాబాద్‌లో దీక్ష చేపడుతున్న అశోక్‌కు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మద్దతు తెలుపుతున్న నేపథ్యంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరస్వామిని ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

కొనసాగుతున్న యూరియా తిప్పలు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రోజులు గడుస్తున్నా మండల పరిధిలో రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. కేవలం ఒక్క యూరియా బస్తా కోసం మండుటెండలో రైతులు గంటల తరబడి లైన్లలో బారులు తీరి నిలబడి అవస్థలు పడుతున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ హాకా సెంటర్‌కు 350 బస్తాలు, మన గ్రోమోర్ సెంటర్‌కు 222 యూరియా బస్తాలు, తిరుమల ఫర్టిలైజర్స్‌కు 88, శివునిపల్లి మాధురి ఫర్టిలైజర్స్‌కు 88 బస్తాల స్టాక్ రాగా సోమవారం పంపిణీ చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆధిక్యతను చాటాలి

దేవరుప్పుల: ఊరూరా కాంగ్రెస్ శ్రేణులు సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆధిక్యత చాటేందుకు సన్నద్ధం కావాలని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి సూచించారు. సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.

సాగునీటి కోసం రైతుల ఆరాటం

దేవరుప్పుల: ఖరీఫ్ సాగులో ఆశించిన వర్షాలు లేకపోవడంతో చెరువులు నిండకపోవడంతో సాగునీటి కోసం ధర్మాపురంలో రైతులు ఆరాటం పడుతున్నారు. కాగా, సోమవారం బీఆర్ఎస్‌కు చెందిన కొడకండ్ల మార్కెట్ మాజీ వైస్ చైర్మన్‌లు అనంతోజు కృష్ణమూర్తి, గండిపెల్లి యాకయ్య, రెడ్యా, లాలు నాయక్ తదితరులు రైతుల భాగస్వామ్యంతో జేసీబీతో శాతాపురం సరిహద్దు నుంచి ధర్మాపురం మధ్య సాగునీటి సరఫరాకు అంతరాయం ఉన్న ప్రదేశాల్లో పేరుకపోయిన చెత్తచెదారం, మట్టి, రాళ్లను తొలగించారు.

జయప్రదం చేయండి

జనగామ రూరల్: వీర తెలంగాణ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా ఈనెల 17 పట్టణంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు బొట్ల శేఖర్ అన్నారు. సోమవారం సభ విజయవంతం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించారు. అలాగే అంబేద్కర్ నగర్ శాఖ కార్యదర్శి మున్సిపట్ల జయ వార్డులో తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

పాలకుర్తి: ఈనెల 17వ తేదీన జిల్లా కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవాల బహిరంగ సభను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి మాచర్ల సారయ్య పిలుపునిచ్చారు. గూడూరులో సాయుధ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా బెల్లి యాదయ్య, నక్క రాజయ్య, ఉపునూతుల రాములు, జ్యోతి పెంటయ్య, ఎండి మైబెల్లి, కుంట నర్సమ్మ కుటుంబ సభ్యులను సన్మానించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



జనగామ రూరల్: జనగామ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారం నంబర్–1 సికింద్రాబాద్ వైపు వెళ్లే లైన్‌లో గుర్తు తెలియని 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి రైలు నుంచి కిందపడి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. జీఆర్‌పీ పోలీసులు తెలిన వివరాల ప్రకారం.. మృతుడి కుడి చేతిపై జి.గౌరీ అనే పచ్చబొట్టు ఉందని, ఎలాంటి ఆధారాలు లేవన్నారు. మృతదేహాన్ని జనగాం ఏరియా హాస్పిటల్ మార్చురీలో భద్రపరచినట్లు తెలిపారు. తెలిసిన వారు జనగాం జీఆర్‌పీ పోలీసు 9247800433 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వంటపాత్రల చోరీ

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వండేందుకు వినియోగించే వంటపాత్రలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన సోమవారం తెలిసింది. పాఠశాల హెచ్‌ఎం ఎం.సంపత్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం, ఆదివారం వరుసగా రెండురోజులు పాఠశాలకు సెలవులు రావడంతో రోజూమాదిరిగానే శుక్రవారం సాయంత్రం తరగతి గదులు, వంటగదితో పాటు పాఠశాలగేటుకు తాళం వేశారు. కాగా, సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చేసరికి వంటగది తెరచి ఉండటంతో అనుమానంతో వెళ్లి చూడగా వంటపాత్రలు లేవని తెలిపారు. దొంగలు వంటగదుల తాళాలను కోసి వంటపాత్రలను ఎత్తుకెళ్ళారని హెచ్‌ఎం తెలిపారు. రూ. 40వేలు విలువైన పాత్రలు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్స్‌డేలో విద్యుత్ ఉద్యోగులు

నర్మెట: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఇంజనీర్స్ డేను సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఓ అండ్ ఎం వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఈ పాము సుధాకర్‌ను, సబ్ ఇంజనీర్ మన్నె రాజులను సిబ్బంది శాలువాతో సన్మానించారు.

యూనిఫామ్‌ల పంపిణీ



యూనిఫామ్స్‌ను పంపిణీ చేస్తున్న ఎంఈఓ

బచ్చన్నపేట: బండనాగారం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు రైతు పరస్పర సహాయ సహకార పొదుపు పరపతి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో అందించిన యూనిఫామ్‌లను ఎంఈఓ ఇర్రి వెంకట్‌రెడ్డి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు చల్ల సత్యలక్ష్మి సురేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు కొల్ల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి చల్ల జనార్దన్‌రెడ్డి, హెచ్‌ఎం హేమారాణి, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.